

జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి

[ప్రవేశం, కీచకుడు, షుమారు ముప్ఫై ఏళ్లుంటాయి, ప్రెంఛికట్ మీసం బెంగాలీ క్రాపు.]

నా పేరు సింహబలుడు. నేను విరాటరాజుగారి పెద్ద బావమరిదిని. నేను మెత్తగా ఉన్నంతసేపు లక్కల్లే ఉంటాగాని—బిగిశానంటేనా—హెం—యమ నిక్కు—నిక్కుతా! ఏమిటో అల్లా టప్పాకింద కట్టేస్తున్నట్లుంది లోకం...ఉల్లిపాయల పులుసు అంటే నాకు—ఎంత ఇష్టమో...?

[ద్రౌపది యింతట్లో ప్రవేశించి ఆరు నెలలనాడు పోయిన ఉత్తర పాత చెడావుల్ని వెతుకుతూ అక్కడే తచ్చాడు తూంటుంది—వయస్సు ఇరవై ఆరు—కష్టాలనుభవించిన మొహం.]

సింహబలుడు:—(తనలో) ఈ అమ్మాయినే కదూ—కాముకి—అని అన్నాడు మా ఊరి అబ్బాయి. (పైకి) తమరేనా మాఅక్క అంతఃపురంలో యిటీవల ఉన్నది.

ద్రౌపది:—అవును.

సింహ:—నా పేరు సింహబలుడు. నేను విరాటరాజుగారి పెద్ద బావను.

ద్రౌపది:—చిత్తం. తమరు పండితులని విన్నాను.

సింహ:—నాకు పెద్దబాలశిక్ష బాగా వొచ్చును.

ద్రౌపది:—చిత్తం.

సింహ:—(తనలో) ఈ అమ్మాయి బాగా ఉల్లిపాయలు తింటుందల్లే ఉంది. అమ్మో ఎంత "శృంగారరసపట్ట భద్ర"యో? (పైకి) మీ పేరు?

ద్రౌపది:—సైరంధ్రి అంటారు!

సింహ:—మీరు ప్రబంధయుగం లోంచియిలా చక్కా వొచ్చారా? (తనలో-భలే బావుంది).

ద్రౌపది:—ఓ నాటకంకూడా దాటి వొచ్చాను.

సింహ:—(తనలో) పాపం-ప్రబంధం అంటే ఎరగదల్లే ఉంది (పైకి) ప్రబంధం అంటే ఎరగరా మీరు? కవిచౌడప్ప శతకంలేదూ...అట్టివి ప్రబంధాలంటే—మీకు సంగీతం బాగా వొచ్చునుకుంటా?

ద్రౌపది:—(తనలో) ఛీ—వీడొక భ్రష్టుడు.

సింహ:—ఇప్పుడు పాడమంటాననా ఆలోచిస్తున్నారు? అబ్బే ఎల్లుండి మా యింట్లో కచ్చేరి పెట్టిద్దామని.

ద్రౌపది:—(తనలో) వీణ్ణి ఎల్లాగన్నా మన్ను చెయ్యాలి.



3రగి